# అసమ - తసమ

అనగా అనగా అదొక దేశం. చాలమందికి విదేశం.

అందరికీ సమమైన అవకాశాలుంటాయి కనక ఆ దేశానికి సమ దేశం అనే పేరు పెట్టుకుందాం. సమమైన అవకాశాలు వుంటాయి కనక, అక్కడికి ఎక్కడెక్కడినించో చాలమంది వచ్చి చేరారు.

వారిలో మదీయులనబడే వాళ్ళు కూడా వచ్చి చేరారు. ఒకళ్ళకన్నా ఎక్కువ మదీయులున్న చోట కనీసం రెండు వర్గాలు లేదా రెండు సంఘాలు వుండాలని మదీయ రాజ్యాంగంలో అక్షరాలా వ్రాసే వుంది కనుక మదీయుల్లో అక్షరాలా బేధాభిప్రాయాలు వచ్చాయి. అయినా నిప్పు లేకుండా పొగ పెడితే, సామెతలకి అన్యాయం చేసినట్టుంటుందని పొగ రాకుండా చూసుకున్నారు.ఈలోగా మదీయ దేశంలోని నేతలు ఇద్దరికీ సామెతలంటే మహా ఇష్టం. "కూసే గాడిదలు వచ్చి మేసే గాడిదల్ని చెడగొట్టాయని"లాటి సామెతకి న్యాయం చేయటం కోసం, మదీయులని కలిసినప్పుడు, వాళ్ళ పుట్టింటి పురిటింటి వాసన కుసింత మదీయుల మనసుల్లో పులిమేశారు. అలా మేసిన భావాలతో మదీయుల ఆలోచనలు పాడయిపోయిన క్షణంలో, ఎలాగూ రాక రాక ఎంతో దూరంనించి వచ్చాంకదా అని, కాస్త వాళ్ళ అభిప్రాయాలూ అభిమానాలే కాక తమ దురభిప్రాయాలూ దురభిమానాలూ కూడా నూరిపోసి మదీయుల్ని విభజించి రెండుసంఘాలు ఏర్పడటంలో యధాశక్తి సహాయం చేసి, వెళ్ళి"పోయారు".

అప్పటినించీ మదీయులు, అసమదీయులు తసమదీయులు అనే రెండు రకాల సంఘాలు పెట్టుకుని, తమ సంఘాల ద్వారా తమ ఘనత చాటుకుంటూ, ఎవరి నూతులలో వాళ్ళు సహజీవనం చేస్తున్నారు.

కథ కాలిఫోర్నియాకి మనం ఇంటికి అనుకుందాం అనుకునే సమయంలోనే అసలీ కథ మొదలయింది. ఈరెండు సంఘాలూ ఏటా జరుపుకునే తిరునాళ్ళల్లో అసమ తెగకి చెందిన "ఫలానా అసమ" అనే ఆయన్ని ఆస్థాన కి నోటుగా పిలిపిస్తుంటే, తసమవారు అదే తెగకు చెందిన "ఫలానా తసమ" అనే ఆయన్ని వాళ్ళ ఆస్థాన కీ నోటుగా పిలిపించటం మొదలుపెట్టారు. అంతేకాదు ఆహ్వానితుల పేర్లు చూస్తే తెలిసిపోతుంది, అది ఎవరి కార్యక్రమమో.

ఇలా అసమదీయులూ, తసమదీయులూ స్నేహపూర్వకంగా పోట్లాడుకునే సమయంలో మదీయుల రెండో తరం కథ, మూడు పాటలూ ఆరు డాన్సుల తర్వాత తెలుగు సినిమా కథలాగా ఇంటర్వెల్ తర్వాత మొదలయింది.

అసమకుమార్ అనబడే ఒక రెండో తరం అబ్బాయి, తసమకుమారి అనబడే రెండో తరం అమ్మాయిని ప్రేమించాడు. ఎంత ఘాటుగా ప్రేమించారో తెలుసుకోవాలంటే, పాతాళ భైరవి సినిమా పాట వినటానికి అది మరీ పాతదయిపోయింది. పార్కుల్లో వాళ్ళిద్దరూ అరవైమంది కోరస్‌తో చేసే డాన్స్ చూద్దామంటే, ఇద్దరికీ చదువూ సంస్కారం వున్నాయి కనుక అలాటివి వాళ్ళు చేయరు. మరి ఎలా?

ఎలా ఏముంది. అది అసలే సమదేశం. అందులోనూ వీళ్ళు తరతమ బేధాలు లేని రెండో తరం మనుష్యులు. అందుకనే సూటిగా చెప్పేశారు. అది విని అసమకుమార్ నాన్న, అసమయ్య అతని మీద అరిచి, ససేమిరా అన్నాడు.

నాన్నగారి మాటలకీ అర్థాలే వేరులే అన్నాడు అసమకుమార్. తసమకుమారి అమ్మ, తసమమ్మ ఆ పిల్లని తిట్టి, పక్కనేవున్న కుండ బద్దలు కొట్టి అలాటి పప్పులీ కుండలో వుడకవు అని చెప్పింది. కుండలు మన్నేనోయ్ అన్నా మట్టి కుండలు మన్నవు కనుక తసమకుమారి ధైర్యంగా నో అంది.

దానితో ఈ కుటుంబ గాథా చిత్రం ఆ కుటుంబంతో ఆగక సాంఘిక పరిణామం చెంది సంఘ పరిమాణంలో చర్చించబడింది. మన అసమదీయులు ఇలా అపకతవక సంబంధాలు కలుపుకుంటూ పతనమై పోతుంటే మానవజాతి ఏమైపోవాలని అసమలు నొక్కి వక్కాణించారు, నోట్లో పక్కపొడి కసకసా ఆడిస్తూ.

ఆ రోజు బ్రహ్మంగారు చెప్పనే చెప్పారు ఇలాటి వింతలూ అబ్బురాలూ జరుగుతాయని. ఇప్పుడు తెలుస్తున్నది ఆయన మాటల్లోని నిజం అన్నారు తసమజనం. పెద్దవాళ్ళయిన పెద్దలు హన్నా అన్నా వినకుండా, పట్టిన పట్టు విడవకుండా "మా పేర్ల ముందు శ్రీ, శ్రీమతి అని వ్రాసుకునే అవకాశాన్ని మేం వదులుకోం" అని గట్టిగా చెప్పారు కుమారూ, కుమారీ.

అయితే మన తక్షణ కర్తవ్యం ఏమిటి అని ఇరు వర్గాలవారూ తర్జన భర్జన పడ్డారు. పడ్డవారు లేవకముందే, కుమారూ కుమారీ అన్నారు, "మీరు వేళ్ళు కొరుకున్నా, జుట్టు పీక్కున్నా మాకేం నష్టం లేదు. విరిగేవి మీ గోళ్ళే. ఊడేది మీ జుట్టే. లాభం మాత్రం మాది. మా పెళ్ళిడీ. మర్యాదగా వచ్చి అక్షింతలు వేస్తే వెయ్యండి. లేదా మేమే వేసుకుంటాం. లేదా మీ బియ్యం ప్రజా సంక్షేమం కోసం ఆదాచేస్తాం"

"ఈ అరాచకాన్ని నా కళ్ళతో చూడలేను" అన్నాడు అసమయ్య, కళ్ళజోడు జేబు రుమాలలో తుడుచుకుంటూ.

"నీ కళ్ళతో కాకపోతే ఇంకెవరి కళ్ళతో చూస్తావయ్యా అసమ మామా. కుమారు నీ కుమారుడుగానే వుండాలంటే నీకు వేరే గతి లేదు. నీకు ఒఖ్ఖగానొక్క కొడుకు. డాన్స్ హాలు, ఆల్కహాలు, పెగ్గులూ, డ్రగ్గులూలాటివేమీ లేకుండా ఒద్దికగా పెరిగిన బంగారం. మీ వాడు చక్కగా చదువుకుని మంచి ఉద్యోగంలో వున్న రాముడు మంచి బాలుడు. ఊళ్ళడిగాడా ఊరేగించమన్నాడా. తనకి నచ్చిన చిన్న

దాన్నిచ్చి పెళ్ళిచేయమన్నాడు. దాంట్లో తప్పేముంది. నా మాట విని మీ కుమారుని ఆ కుమారికి ఇచ్చి పెళ్ళి చేసి, మా అందరికీ చందన తాంబూలాది సత్కారాలు అందించి మమ్మల్ని సంతోషపెట్టు. లేకపోతే ఆ జేబు రుమాలతో రేపు కళ్ళజోడు కాదు, నీ కళ్ళు తుడుచుకోవాల్సి వస్తుంది" అన్నాడు ఆయన మిత్రుడు సమరం.

"తసమ వర్గానికి చెందిన నేను, తసమారావుగారిని పెళ్ళిచేసుకోవటం వల్లనే, ముప్ఫై ఏళ్ళ తర్వాత కూడా ఈనాటికీ నా పవిత్ర మాంగల్య బంధం గట్టిగా వుంది. అలాటిది ఈ సంకర జాతి పెళ్ళితో మా కుమారి భవిష్యత్తు పాడవటం నేను భరించలేను" అంది బాధ పడుతూ తసమమ్మ.

"ఆఁ! చెప్పొచ్చావులే చోద్యం. నీకు పెళ్ళయిన ముప్ఫై ఏళ్ళలోనూ, పాతికేళ్ళు నీ మంగళసూత్రాన్ని బ్యాంక్ లాకర్‌లో పెట్టావుగా. ఆరు కాసుల సూత్రం దొంగలెత్తుకుపోతారని భయంకదా నీకు. మరి భద్రంగావుండక చస్తుందా. తసమ కుమారి అందాల పసిడి బొమ్మ. కృష్ణుడిలాటి ఏ నల్లవాడినో, రాముడిలాటి ఏ నీలం వాడినో, అమెరికన్‌లాటి తెల్లవాడినో చేసుకోవటం లేదు కదా. మన పిల్ల మన మదీయుల పిల్లాడినే చేసుకుంటానంటున్నది. కాకపోతే తసమదీయుల బదులు అసమదీయుల పిల్లాడు. అచ్చు తప్పు పడింది అనుకో. అప్పుడంతా సవ్యంగానే వుంటుంది. నా మాట విని ఆ ఇద్దరి పసిడి జీవితాలకి అడ్డం రాకండి. వస్తే మీకు మిగిలేది.... వాళ్ళ పెళ్ళికి పోస్టులో మీకు వచ్చే ఆహ్వానమే" అంది పక్కింటి లావుపాటి పిన్నిగారు.

ఆ పక్కింటి లావుపాటి పిన్నిగారు అటు అసమదీయులకీ, ఇటు తసమదీయులకీకూడా పిన్నిగారే. అందరితో సన్నిహితంగా వుంటుంది. కాకపోతే లావుపాటి పిన్నిగారి భర్త, మందపాటి బాబాయిగారితోనే చిక్కు. బాబాయిగారు ఈ అసమ తసమ గొడవలు చూశాక, తను ఆ రెండిటికీ చెందడు కనుక, మదీయుల రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా చదివిన పెద్ద తలకాయని సంప్రదించాడు. మదీయుల రాజ్యాంగంలో మూడో వర్గానికి అవకాశం వుందా అని అడిగాడు.

ఆ పెద్ద తలకాయ తన చిన్న తలకాయని పైకీ కిందకీ ఆడించాడు. ఒక చిరునవ్వు నవ్వాడు.

"బాబాయిగారూ! ఉంది. తప్పకుండా వుంది. కానీ మీరు మీ వర్గానికి పేరేం పెడతారు. అసమ, తసమలాగా ఒసమ అనా? అందులోనూ మీ ఇంటి పేరు బిల్లంగోడు. ఒసమ బిల్ గోడెన్ అంటారా. మీ ఇంటి దగ్గర పొదల్లో ఎప్పుడయినా చూశారా. ఆ బుషుల్లో వుంటారు ప్రెసిడెంట్ బుష్, సి.ఐ.ఏ. ఏజెంట్లూ. మిమ్మల్ని ఒసమ బిన్ లాడెన్ అనుకుని పట్టుకుపోయి, నేతిలో వేయిస్తారు. కనుక అలాటి పిచ్చి పనులు మానేసి, కాస్త మజ్జిగ తాగి, మీ కడుపులో చల్ల కదలకుండా చూసుకోండి!" అని ఒక చల్లని సలహా ఇచ్చాడు.

* * *